క్లుప్తంగా

విద్యుత్ వైరు చోరీ

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని తూగుండ్రం రోడ్డు సమీపంలోని తన వ్యవసాయ భూమిలో మోటారు విద్యుత్ వైరు(తీగలు) చోరీకి గురైనట్లు రైతు రాజు తెలిపారు. శనివారం ఉదయం వ్యవసాయ భూమికి వెళ్లి మోటార్ వేద్దామని చూడగా దాదాపు పదివేల రూపాయలు విలువగల విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించుకు వెళ్లిపోయారని, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

కార్వేటినగరం: మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ రమేష్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చింత మండి సమీపంలో ఉన్న ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మామిడి పంటకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నాలుగు రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జాతీయ రహదారిపై ఫ్యాక్టరీ ఎదుట మామిడి రైతులతో కలసి నిరసన కార్యక్రమం చేసేందుకు సిద్ధంగా ఉంటామని హెచ్చరించారు. ఫ్యాక్టరీ మేనేజర్ వెంకటేశ్వర్‌కు రైతులతో కలసి వినతిని అందించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు

పాలసముద్రం: టీవీఎన్ఆర్ పురం అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం సీడీపీఓ పద్మ సునంద సందర్శించారు. సాక్షి దినపత్రికలో గ్యాస్ లేక అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు ఆకలి కేకలు అంటూ వచ్చిన వార్తకు స్పందించిన సీడీపీఓ పద్మ సునంద అంగన్‌వాడీ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసిన గ్రామస్తులతో ఆమె మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు ఇక జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సూపర్‌వైజర్ అనురాధ, సర్పంచ్ అమరావతి ఉన్నారు.

ఎన్టీఆర్ జలాశయంలో గుర్తుతెలియని మృతదేహం

పెనుమూరు(కార్వేటినగరం): ఎన్టీఆర్ జలాశయం బ్యాక్ వాటర్‌లో గుర్తుతెలియని మృతదేహం తేలియాడుతుండడం శనివారం రాత్రి కలకలం రేపింది. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. కలవకుంట వద్ద ఉన్న ఎన్టీఆర్ జలాశయం బ్యాక్ వాటర్‌లో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందిందని తెలిపారు. ఆదివారం ఉదయం మృతదేహాన్ని బయటికి తీసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు పేర్కొన్నారు

వేరుశనగ సాగు.. లాభాలు బాగు



ప్రస్తుతం వాతావరణంలో మార్పులతో మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు మెట్ట భూముల్లో సాగు చేసే ప్రధాన పంటల్లో వేరుశనగ ఒకటి. ఖరీఫ్ సీజన్‌లో సుమారు 550 హెక్టార్లు ఈ పంట సాగు పెరిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో రైతన్నలు విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులు, మెళకువలను మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ వివరించారు. –పాలసముద్రం

పాలసముద్రంలో మెట్ట భూమిలో విత్తనాలు వేస్తున్న కూలీలు, (ఇన్‌సెట్) వేరుశనగ విత్తనాలు సిద్ధం చేస్తున్న కూలీలు



- వేరుశగన సాగుకు కదిరి–9, కదిరి–6, ధరణి, నారాయణీ రకాలు 105 నుంచి 110 రోజుల్లో కోతకు వస్తాయి. జూన్ నెల మొదటి వారం నుంచి ఆగస్టు నెల రెండో వారం వరకు సాగు చేసుకోవచ్చు.
- ఎకరాకు 50–60 కిలోల విత్తనాలు చాలు. 3.10 నుంచి 15 సెంటీమీటర్లు ఎడమతో విత్తుకోవాలి. కిలో విత్తనానికి 2 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ కలిపిన తర్వాత ఒక గ్రాము ట్రైబుకొనజోల్ లేదా 3 గ్రాముల మ్యాంకోజెబ్ కలిపి విత్తన శుద్ధి చేయాలి. ట్రాక్టర్‌తో లాగే గొర్రుతో విత్తనం వేస్తే సమయం, విత్తనం ఆదా అవుతుంది. రోజుకు 5 నుంచి 6 హెక్టార్లలో విత్తనం వేయవచ్చు.
- కొత్తగా వేరుశనగ సాగు చేసేటప్పుడు విత్తనానికి రైజోబియం కల్చర్ పట్టించాలి. మొదలు కుళ్లు, వేరు కుళ్లు, కాండం కుళ్లు తెగుళ్లు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఒక కిలో విత్తనానికి 4 గ్రాముల ట్రైకోడెర్మా విరిడిని పట్టించాలి.
- నిద్రావస్థ రకాలు కదిరి(7, 8, 9) విత్తనాన్ని 5 మి.లీ ఇథరిల్‌ను 10 లీటర్ల నీటితో కలిపిన ద్రావణంలో 12 గంటలు నానబెట్టి తర్వాత నీడలో అరబెట్టి విత్తుకోవాలి.
- ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువు కనీసం 2 నుంచి 3 సీజన్లకొకసారి వేయాలి. భూసార పరీక్షలననుసరించి రసాయన ఎరువులు వాడాలి. 8 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌ను ఇచ్చే ఎరువులు విత్తనం వేసేటప్పుడు వాడాలి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ పాస్ఫేట్ రూపంలో వేస్తే మంచిది. భాస్వరం, పొటాష్‌లను భూసార పరీక్షల ఆధారంగా వేసుకోవాలి. నేలలో అతి తక్కువగా ఉండి సిఫారసు చేసిన మోతాదుతో వేయాలి. మధ్యస్థంగా ఉంటే సిఫారసు చేసిన మోతాదులో సగం వేయాలి. అధికంగా ఉంటే వేయనవసరం లేదు.
- పూత దశలో ఎకరాకు 200 కిలోల జిప్సం మొక్కల మొదళ్ల వద్ద వేసి మట్టి కప్పాలి. జింకు సల్ఫేట్ ఎకరాకు 20 కిలోల కనీసం మూడు దఫాలు వేయాలి.
- పంట విత్తడానికి ముందు ఫ్లూక్లోరాలిన్ 1 నుంచి 1.25 లీటర్లు మందును 200 లీటర్ల నిటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ఇలా చేయకపోతే విత్తిన వెంటనే విత్తనం మొలకెత్తక ముందు బుటాక్లోర్ లేదా పెండిమిథిలిన్ లేదా ఆక్సీఫ్లోర్ ఫెన్ 600 నుంచి 800 మి.లీ ఎకరాకు వాడొచ్చు. తర్వాత కూలీలతో ఒకసారి కలుపు తీయించాలి. ఈ మందులు వాడితే పంట విత్తిన 20 రోజులకు కలుపు మొక్కలు రెండాకుల దశలో ఉన్నప్పుడు ఎకరాకు 30 మి.లీ ఇమథావుర్ లేదా క్విజలోపాల్ ఇథైల్ 400 మి.లీ వాడాలి.
- విత్తనం మొలకెత్తిన తర్వాత 25 రోజులపాటు నీటి ఎద్దడి కల్పిస్తే మొక్కలు ఎత్తు పెరగక, ఊడలుగా దిగి దిగుబడిని ఎక్కువగా ఇస్తాయి. చివరి తడిని 90 రోజులకివ్వాలి. వేరుశనగకు తుంపర్ల పద్ధతిలో నీటిని ఇస్తే 24 నుంచి 30 శాతం నీటిని ఆదా చేయొచ్చు. దిగుబడి పెరుగుతుంది.
- వేరుశనగ పంట చుట్టూ జొన్న వేసుకోవాలి. వేరుశనగలో అంతర పంటగా కందిని 7:1 నిష్పత్తిలో వేయవచ్చు.

విద్యార్థికి ఘన నివాళి

శ్రీరంగరాజపురం: కర్ణాటక రాష్ట్రంలో రోడ్డు ప్రమాదానికి గురైన పుల్లూరు గ్రామానికి చెందిన తులసి మృతదేహానికి మాజీ డిప్యూటీ సీఎం ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థి మృతిపై సమాచారం అందుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి పుల్లూరుకు చేరుకుని తులసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్ఆర్ సీపీ తరపున ఆదుకుంటామని భరోసా కల్పించారు. మాజీ డిప్యూటీ సీఎంతో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గురవారెడ్డి, ఎంపీపీ సరిత, మండల కన్వీనర్ మణి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాళప్ప, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్, జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య, సర్పంచ్ బాబు, నాయకులు హరిరెడ్డి, యోగానందం, వెంకటేష్, మణి, జయ, మధు, శోభన్‌బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం

ఉచితంగా కంటి వైద్య పరీక్షలు

గంగాధరనెల్లూరు: మండలంలోని ముసలయ్యగారిపల్లి గ్రామంలో ఎస్.మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ ఆసుపత్రి ఆధ్వర్యంలో ముసలయ్యగారిపల్లి గ్రామంలోని కమ్యూనిటీ భవనంలో ప్రజలకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 28 మంది కి డాక్టర్ సిఫారసు మేరకు చెన్నైలో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు శస్త్ర చికిత్స చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బాలాజీరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, దామోదర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, మురళీకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



ముసలయ్యగారిపల్లిలో కంటి పరీక్షలు

రక్తదానంతో ప్రాణాలకు రక్షణ

నగరి: రక్తదానంలో ప్రాణాలను రక్షించవచ్చని ఏరియా ఆస్పత్రి రక్తనిల్వ కేంద్ర వైద్యురాలు టి.స్పందన అన్నారు. శనివారం ఆస్పత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఆమె నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు, నర్సులు, సిబ్బందితో రక్తదాన ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని 20 యూనిట్ల రక్తాన్ని స్వచ్ఛంద రక్తదాతల నుండి సేకరించారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక వ్యక్తి చేసే రక్తదానం 4 ప్రాణాలు కాపాడుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోందన్నారు. ఒక వ్యక్తి ప్రతి 3 నెలలకు ఒకసారి సాధారణ రక్తదానం చేయవచ్చన్నారు. 18–60 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి తీవ్రమైన వ్యాధులు లేకుండా బరువు 45 కిలోల పైన ఉండి బీపీ అదుపులో ఉన్నవారు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేసేవారికి హిమోగ్లోబిన్ 100 మిల్లీ లీటర్లు రక్తంలో 12.5 గ్రాముల కంటే ఎక్కువగా ఉండాలన్నారు. రక్తదానం చేయడంతో పెద్దపేగు, ఊపిరితిత్తులు, కాలేయం, గొంతు, క్యాన్సర్లు రాకపోవడమే కాకుండా గుండె సంబంధిత వ్యాధులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ మంజుల, వైద్యులు కార్తీక్, నర్సింగ్ సూపరింటెండెంట్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన దినోత్సవంలో వైద్యులు, సిబ్బంది

తనిఖీ బృందాలకు సహకరించాలి

నింద్ర: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో జరిగిన ఉపాధి పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. దీంతో ప్రతి గ్రామ పంచాయతీలో జరిగిన పనుల వివరాలు సేకరించి, గ్రామ సభల ద్వారా తనిఖీలు చేపడుతున్నారు. ఉపాధి పథకం ఏపీఓ శనివారం వివిధ గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరిగిన పనులకు సంబంధిత రికార్డు చేసిన వివరాలు పూర్తిగా వారికి అందించాలని అన్నారు. గ్రామ సభలో కూడా కూలీలు కూడా ఎన్ని రోజులు పని చేసిన వివరాలు, పనికి కూలీ వివరాలు తెలపాలన్నారు. పూర్తి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

విధిగా పౌష్టికాహారం తీసుకోవాలి

నింద్ర: బాలింతలు, కిషోర బాలికలు ప్రతినిత్యం విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్ వైజర్ శ్యామల అన్నారు. శనివారం మండలంలోని అరూరు, ఎలకాటూరు గ్రామాల్లో అంగన్ వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, కిషోర బాలికలు ఆహారం తీసుకునే విధానాలు, పరిసరాల పరిశుభ్రత, ఆహార శుభ్రత చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

కార్వేటినగరం: మండలంలోని సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకుల సుబ్రమణ్యం 19వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు, మాజీ మార్కెటింగ్ డైరెక్టర్ ఆకుల గోపి వృద్ధులకు అన్నదానం చేపట్టారు. అలాగే పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆకుల గోపి మాట్లాడుతూ ఆకుల సుబ్రమణ్యం టీకేఎం పేట, సీడీ కండ్రిగ పంచాయతీలు ఉమ్మడిగా ఉన్నప్పుడు 35 సంవత్సరాలపాటు సర్పంచ్‌గా పేదలకు సేవలు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆకుల గిరిజ, ఆకుల చైతన్య, నాగరాజు, మునిమందడి పలువురు పాల్గొన్నారు.

ఆలరించిన అర్జున తపస్మాన్

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని పర్యాటక కేంద్రమైన పులిగుండు వద్ద వెలసి ఉన్న శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా శనివారం అర్జునుని తపస్సు భక్తులను ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమం నిర్వహించారు. 11 గంటల నుంచి అర్జున వేషధారి మెట్టు మెట్టుకు పద్యాలు పాడుతూ తనతో తీసుకెళ్లిన నిమ్మకాయలు, విభూది, పుష్పాలను భక్తుల పైకి విసురుతూ తపస్సుమాను అధిరోహించారు. మహిళా భక్తులు తడిబట్టలతో తపస్సుమాను చుట్టూ అధికసంఖ్యలో వరపడ్డారు. నిమ్మకాయలు, విభూది కోసం యువత, భక్తులు ఎగబడ్డారు. ఈశ్వరుని కోసం అర్జునుడు చేసిన తపస్సు ఘట్టాన్ని కళ్లకు కట్టినట్లుగా భాగవతారిణి గాత్ర కచ్చేరి నిర్వహించారు. కనికాపురం గ్రామానికి చెందిన గూటాల కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అదే గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ ఎంపీపీ హేమలతారెడ్డి, మాజీ మండల కన్వీనర్ మహాసముద్రం సురేష్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



తపస్మాన్ అధిరోహిస్తున్న అర్జున వేషధారి

రథోత్సవ వైభోగం

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు శనివారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారు రథాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9 గంటలకు పట్టుపీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలతో ముగ్ధ మనోహర రూపంలో స్వామి, అమ్మవార్లు రథారోహణం చేశారు. అనంతరం 9.25 గంటల నుంచి మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాలు, అశేష భక్తజన గోవిందనామ స్మరణలతో ఆలయ మాడవీధుల్లో రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం 5 గంట లకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశ్వరూప దర్శనం, తోమాల సేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామివారి సర్వదర్శనానికి అనుమతించారు. 8 గంటలకు పుణ్యాహవచనము, నవగ్రహపూజ నిర్వహించారు. 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 వరకు భక్తి కీర్తనల ఆలాపనల మధ్య స్వామివారి ఊంజల్ సేవ కనుల పండువగా సాగింది. అనంతరం శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు.



మాడవీధుల్లో రథంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

అశ్వంపై నుంచి అభయహస్తం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 7 నుంచి 8 గంటలకు శ్రీవారు అశ్వ వాహనంపై పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో విహరిస్తుండగా అశేష భక్తజన గోవిందనామ స్మరణలతో మాడవీధులు మార్మోగాయి. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, యువతుల ఆనంద డోలికల కోలాటం నడుమ స్వామివారు ఆశేష భక్తజనానికి అభయమిచ్చారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి స్వామివారిని కనులారా దర్శించుకున్నారు. వాహన సేవ అనంతరం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు.



అశ్వ వాహనంపై ప్రసన్న వేకంటేశ్వరస్వామి

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పల్లకీ ఉత్సవం, 10.30 నుంచి 10.45 గంటల వరకు తీర్థవారి చక్రస్నానం, రాత్రి 7 గంటల నుంచి 7.30 వరకు నిర్వహిం ధ్వజావరోహణంతో ప్రసన్న వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

యోగా సంస్కృతిలో భాగం



యోగాపై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

పుత్తూరు: భారతీయ సంస్కృతిలో యోగా ఓ భాగమని మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్ తెలిపారు. శనివారం స్థానిక వైఎస్ఆర్ మున్సిపల్ పార్క్‌లో మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులతో యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

వెదురుకుప్పం: యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేయవచ్చని ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో యోగా రిహార్సల్స్ నిర్వహించారు. తహశీల్దార్ బాబు, మండల స్థాయి అధికారులు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: యోగాను రోజువారీ దినచర్యలో ఒక భాగంగా చేసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు రావని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ తెలిపారు. శనివారం కృష్ణాపురం జలాశయం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాసనాల కార్యక్రమానికి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఐ హనుంతప్ప, ఏఎస్ఐ మునికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అన్నూరు సచివాలయం ఆవరణలో కూడా ఎంఈఓ విజయకుమార్, వీఆర్ఓ ఆనందప్ప యోగాసనాలు వేశారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

పాలసముద్రం: తహశీల్దార్ అరుణకుమారి ఆధ్వర్యంలో తిరుమళరాజుపురం గ్రామస్తులు, విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. ఎంఆర్ఐ దేవి, వీఆర్ఓ వెంకటాచలం పాల్గొన్నారు.

యోగా జీవితంలో బాగం కావాలి

నగరి: నిత్యజీవితంలో యోగా భాగం కావాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. శనివారం గుండ్రాజుకుప్పం మాదిగవాడ ప్రాథమిక పాఠశాలలో యోగా శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ నోటిఫికేషన్ విడుదల

- ఈ నెల 21 నుంచి 28 వరకు కౌన్సెలింగ్
- కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీకుమార్



పుత్తూరు: రాష్ట్ర విద్యా శాఖ వెబ్ కౌన్సెలింగ్, వెబ్ ఆప్షన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు స్థానిక పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీకుమార్ తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి, సత్యవేడులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ నెల 21వ తేదీ నుంచి 28 వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని వెల్లడించారు. పుత్తూరు పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాలలో అడ్మిషన్ కోసం పాలిసెట్‌లో ఉత్తీర్ణత సాధించి ఉంటే చాలని, ప్రభుత్వమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తుందని వెల్లడించారు. కౌన్సెలింగ్‌కు వెళ్లే ముందు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700 ఆన్‌లైన్ ఫీజు చెల్లించిన రశీదుతోపాటు 10వ తరగతి సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువపత్రాలను తీసుకెళ్లాలని తెలిపారు. చిన్న వయస్సులోనే సత్వర ఉపాధి పొందేందుకు పాలిటెక్నిక్ చదవడం ఉత్తమమని ఆయన స్పష్టం చేశారు.